
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JUNE - 2003

## సంక్షిప్త వార్తలు

2003 ఏప్రియల్ 28, 29, 30 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం, పదం వారి వీధిలో యున్న క్రీస్తు సంఘము సువార్త కూటములు ఘనముగా నిర్వహించిరి. ప్రతిరోజు రాత్రి చక్కటి వాతావరణములో కూటములు జరిగెను. ఆ కూటములలో సోదరులు కె. వెంకట్రావ్ (కాకినాడ), పి.యస్.ఆర్. జయపాల్ (ర్యాలి), జాషువా గూటం గార్లు వాక్యపరిచర్యచేసిరి. మరియు సి.హెచ్. దేసింగ్ (రామచంద్రపురం), పి. సుందరరావ్ (అగ్రహారం), సి.హెచ్. మణికుమార్, జాన్ బాబ్ (ర్యాలి) గార్లు తదితర ప్రాంతముల సువార్తికులు పాటలు నడుపుటలోను, ప్రార్థన చేయుటలోను, కూటములకు అధ్యక్షత వహించుటలోను సహకరించిరి. ఈ కూటములలో ఒకరు బాప్తిస్మము పొందిరి. అనేకులు సత్యసువార్తను వినిరి, ప్రభువును స్తుతించిరి; స్థానిక క్రీస్తు సంఘము ఆత్మీయముగా బలపడెను. పదంవారి వీధిలో యున్న క్రీస్తు సంఘమునకు సోదరులు యన్.లాజరస్ మరియు ఆయన కుమారుడు ప్రసాద్ గార్లు వాక్యపరిచర్య చేయుచున్నారు.

మే నెల 7, 8, 9 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం అగ్రహారంలో యున్న క్రీస్తు సంఘము క్రీస్తు సువార్త సభలు జయప్రదముగా జరిపించిరి. ప్రతిరోజు రెండు కూటములు నిర్వహించబడెను. ఆ కూటములలో సోదరులు పి.జాన్‌మోజెస్ (కాకినాడ-ఇంద్రపాలెం), సి.హెచ్. దేసింగ్ (ఆర్.సి.పూర్), యన్. ప్రసాద్ (పదంవారి వీధి), పి.డి. బిషప్ (రావులపాలెం), టి. ప్రసన్న కుమార్ (ద్రాక్షరామా) గార్లు వాక్యపరిచర్య చేసిరి. కూటముల సందర్భముగా ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. బాప్తిస్మము పొందిన వారికి ఒక్కొక్కరికి ఒక బైబిలును స్థానిక సువార్తికులు పి. సుందర్రావ్ గారు బహూకరించిరి. సువార్త కూటములకు అనేక మంది హాజరైరి. హాజరైన వారందరికీ స్థానిక సంఘము నుంచి భోజన పానాదుల నేర్పాటు చేసిరి. సోదర సోదరీలందరు గొప్ప ఆత్మీయ సహవాసములో పాలుపొందిరి.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**



P.O. Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**



Pleading for Restoration of First Century Christianity

సంపుటిక 23 | జూన్ 2003 | సంచిక 9


## ఆరాధనలో సంగీతము - 2

*(Music in Worship-2)*

సృష్టి జరిగిననాటినుండి "ఉదయ నక్షత్రము లేకముగాకూడి పాడినవి"యని భక్తుడైన యోబు బైబిలునందు వ్రాసెను (యోబు 38:7). అందువలన పాటలు పాడుట యనునది మానవుని అనంతముతో కలుపుచున్నది. ద్వితీయోపదేశకాండము 31:19లో, "కాబట్టి మీరు ఈ కీర్తన వ్రాసి ఇశ్రాయేలీయులకు నేర్పుడి. ఈ కీర్తన ఇశ్రాయేలీయుల మీద నాకు సాక్ష్యార్థముగా నుండునట్లు దానిని వారికి కంఠపాఠముగా చేయించుము" అని యెహోవా మోషేకు ఆజ్ఞాపించెను. "కాబట్టి మోషే ఆ దినమందే యీ కీర్తన వ్రాసి ఇశ్రాయేలీయులకు నేర్పెను" అని 22వ వచనము చెప్పుచున్నది. దీనిని బట్టి పాత నిబంధన కాలములోనే యెహోవా దేవుడు స్వరగానమును కోరినట్లు మనము గ్రహించు

కొనగలము.

అయితే హెబ్రీ ఆరాధనలోనికి సీనాయికొండపై ధర్మశాస్త్ర మీయ బడిన ఇంచుమించు 400 సంవత్సరముల తరువాత దావీదు వాయిద్య ములను ప్రవేశపెట్టెను. "యెహోవా మందిరములో తాళములను, స్వరమండలములను, సితారాలను వాయించుటకై అతడు లేవీయుల నేర్పాటుచేసెను అని 2 దినవృ 29:25 మనకు తెలియజేయుచున్నది. క్రీస్తు సంఘము స్థాపించబడిన మొదటి 600 సంవత్సరములలోను ఆరాధనలో క్రైస్తవులు వాయిద్యముల నుపయోగించలేదని ఇదివరకే మనము తెలిసికొన్నాము. సరిగదా ఇంచుమించు 670వ సంవత్సరములో కేథలిక్కులు వాయిద్యములను ప్రవేశపెట్టిరని గూడ మనము తెలిసి కొన్నాము. హెబ్రీ ఆరాధనలోనికి దావీదు వాయిద్యములను ప్రవేశ పెట్టగా, ఆమోసు దావీదువలె ఆరాధనలో వాయిద్యముల నుపయోగించు వారిపై ఒక శాపవచనమును పలికెను. ఆమోసు 6:1-5లను క్లుప్తముగ చదివినయెడల, "ఇశ్రాయేలు వారికి విచారణకర్తలై జనములలో ముఖ్యజనమునకు పెద్దలైనవారికి శ్రమ.......(వారు) స్వరమండలములతో పిచ్చిపాటలు పాడుచు దావీదువలెనే వాయించు వాయిద్యములను కల్పించుకొందురు" అని వ్రాయబడి యున్నది. గనుక చంద్రకాంతి వంటి యూదుల యుగములోనే వాయిద్య సంగీతము ప్రశ్నింపదగిన స్థితిలో కలదని మనకు గ్రహింపవుచున్నది.

క్రైస్తవారాధనలో వాయిద్యముల నుపయోగించుట యనునది కేవలము మనుష్యులు కల్పించిన పద్ధతియే యని మనము అంగీ కరించక తప్పదు. రోమన్ కేథలిక్కువారి సంకెళ్లను తెగత్రెంచుకొని బయటపడిన ప్రొటెస్టాంట్ మతోద్ధారకులు కూడ వాయిద్యముల విషయమై ఏమేమి చెప్పితిరో మనము ఇప్పుడు తెలిసికొందాము: నేడు క్రైస్తవులమని చెప్పకొను అనేక సంఘములు వాయిద్యముల నుపయో గించుచుండగా క్రీస్తుసంఘము క్రొత్త నిబంధనను బట్టి సంఘకీర్తనలతో దేవుని నారాధించుచు సంతృప్తి జెందినదైయున్నది.

జాన్ కెల్విన్ ఇట్లు చెప్పెను - "దేవుని స్తుతించుచు క్రియలతో వాయిద్యముల నుపయోగించుట యనునది సాంబ్రాణి ధూపవేదికల వలెను, ధర్మశాస్త్రపు ఛాయలవలెను, ఏమంత సంబంధమైనది కాదు" (Commentary on Psalms). "అర్గన్ అను వాయిద్యము మన గుడులలో నుండి కనబడకను, వినబడకను ఉన్నయెడల దాని విషయమై నాకేమియును అభ్యంతరము లేదు" అని జాన్ వెస్లీ అను నతడు చెప్పెను. "క్రైస్తవారాధనలో వాయిద్యములు బయలు దేవత ప్రభావములు" అని మార్టిన్ లూథర్ పలికెను. ప్రసిద్ధ మెథడిస్టు విద్యావేత్త యగు ఆడమ్ క్లార్క్ అను నతడు ఇట్లు పలికెను: "దైవారాధనలో వాయిద్యోపకరణ ములు మేలును కల్పించునట్లు నేనెరుగను; సరిగదా అవి కీడునే కల్పించుననుట నమ్ముటకు నవసరమైనంత కారణము కూడ కలదు. సంగీతమయిన శాస్త్రముగాను, కళగాను నేను గౌరవించి ఆనందించెదను. గాని దేవుని మందిరము నందు వాయిద్యములు నాకు హేయములు, అసహ్యములై యున్నవి. వాయిద్యములతో కూడిన గానము గనుక తన అనుచరులయినను ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెనని కోరు చున్నట్టి దేవుని ఆరాధనలోని అట్టి నవ్య కల్పనములకు నా అసమ్మతిని తెలియ జేయుచున్నాను (Commentary on Amos 6:5).

ఈ గొప్ప మతోద్ధారకుల మాటలు దేవుని వాక్యము కంటె విలువైనవని చెప్పుటకు వారి మాటలను నేను మీకు చెప్పలేదుగాని, వారుకూడ దేవుని వాక్యములో ఈ ప్రశ్నకు సంతృప్తికరమైన విశదీకరణమును కనుగొనియున్నారని మీకు చూపించుటకే వారి మాటలను మీకు వివరించితిని.

అనేకులు ప్రకటన గ్రంథములో యోహాను పరలోకమందున్న వీణెలను గూర్చి వ్రాసిన వాక్యమును చదివి, పరలోకమందేమైతే సరియైనదో, అదే భూమి మీద కూడ సరియైనదే యని తలంచెదరు. అందువలన మనము ప్రకటన 14:2-3ను ఇప్పుడు జాగ్రత్తగా చదువుదాము: "మరియు విస్తారమైన జలముల ధ్వనివలెను, గొప్ప ఉరుము ధ్వనివలెను

సమానమైన యొక శబ్దము పరలోకములో నుండి రాగావింటిని. నేను వినిన ఆ శబ్దము వీణెలు వాయించుచున్న వైణికుల నాదమును పోలినది. వారు సింహాసనము ఎదుటను, ఆ నాలుగుజీవుల యెదుటను ఒకక్రొత్త కీర్తన పాడుచున్నారు." ఈ వాక్యమును మీరు జాగ్రత్తగా గమనించిన యెడల యోహాను విస్తారమైన జలధ్వనినిగాని, గొప్ప ఉరుము ధ్వనిని గాని, వీణెలు వాయించుచున్న వైణికుల నాదమునుగాని అతడు వినుచున్నట్లు చెప్పటలేదు. ఒక గొప్పశబ్దము పరలోకము నుండి రాగా అతడు వినెను. అది విస్తారమైన జలధ్వనితో సమానమైనది. అది గొప్ప ఉరుమువలె యుండెను. అది వైణికుల నాదమును పోలియుండెను. 144 వేలమంది దేవుని గొర్రెపిల్లకు స్తోత్రగానములు చేయుచుండగా యోహాను ఆ గొప్పధ్వనిని విని మనకొరకు అలంకారరీతిగా వ్రాసెను.

"మీరు ఆరాధనలో వాయిద్యముల నుపయోగింపరాదు" అని బైబిలు ఎక్కడా చెప్పటలేదు అని కొందరు తలంచవచ్చును. అయితే దేవుడు అట్లు చెప్పెనో లేదో ఇప్పడు చూద్దాం: దేవుడు అహరోనును మేలిమి బంగారుతో ఏడు దీప వృక్ష ప్రకాండములను చేయవలెనని ఆజ్ఞాపించెను (నిర్గమ 25:31-40). నీవు యిత్తడిని గాని వెండినిగాని ఉపయోగించరాదని దేవుడు అహరోనుకు చెప్పెనా? దేవుడు అట్లు చెప్పనవసరము లేకుండగనే మేలిమి బంగారము తప్ప మిగిలిన లోహములన్నియును బహిష్కరింపబడెను గదా. అట్లే మనము ప్రభు రాత్రి భోజనము చేయునపుడు, ప్రభువు బల్లపై నారింజరసమును ఉపయోగింపరాదు అని దేవుడు ఎక్కడైనను చెప్పెనా? దేవుని ఆజ్ఞ ద్రాక్షారసము నుపయోగింపవలెనని చెప్పినప్పడు మిగిలిన రసము లన్నియు ప్రభువు బల్లపై నుంచుటకు వీలులేదని మనము ఇట్టే గమించగలము. అట్లే ఆయన వాక్యము ఆరాధన నుండి వాయిద్యము లను బహిష్కరించుచున్నది.

క్రైస్తవారాధనలో సంగీతము మానవునికి శారీరక సంతోషము కలుగ జేయుటకు గాక, బోధించుటకును, హెచ్చరించుటకును, బుద్ధి

చెప్పటకును యని మనము తెలిసికొనిన యెడల దేవుడు వాయిద్యములను గాక మానవ కంఠస్వరమునే ఎందుకు కోరెనో సులభముగ మనము గ్రహించవచ్చును. ఈ విషయంలో బైబిలు ఆజ్ఞలను మన స్వరములు ఎట్ల నిర్వర్తించగలవో చూద్దాం.

ఎఫెసీ 5:19లో కీర్తనలు పాడుడి యని బైబిలు చెప్పచున్నది. మానవులు పాడగలరు గాని వాయిద్యములు పాడలేవు. కీర్తనల ద్వారా ఒకనినొకడు బోధించుడి యని కొలస్స 3:16 చెప్పచున్నది. వాయిద్యములు ఎవనికి ఏమియు బోధించలేవని మన మెరుగుదుము. ఆత్మతోను, మనస్సుతోను పాడుడి. యని 1 కొరింథి 14:15 చెప్పచున్నది. వాయిద్యములకు ఆత్మగాని, మనస్సుగాని లేవు. గనుక ఈ ఆజ్ఞను అవి నిర్వర్తించలేవు. దేవుని నామ సంకీర్తనము చేయుడియని రోమా 15:9 చెప్పచున్నది. వాయిద్యములు దేవుని స్తుతించలేవు, సంకీర్తనము అంతకుముందే చేయలేవు. సంఘము మధ్యను దేవుని కీర్తిని గానము చేయుడి యని హెబ్రీల 2:12 చెప్పచున్నది. దేవుడు మనకిచ్చిన స్వరములతో దేవుడు కోరునవన్నియును మనము తప్పక చేయగలము. ఆరాధనలో సంగీతము గూర్చి దేవుడు ఆజ్ఞాపించిన ప్రతిదానిని మానవ స్వరము నిర్వర్తించగలదని, వాయిద్యములు ఏమియు చేయలేవని మనము గ్రహించితిమి.

దేవుడు పొరపాట్లను చేయువాడుకాడు. వాయిద్యములు ఆరాధనలో నుండి ఎందుకు ఆయన బహిష్కరించెనో తెలియజెప్పట నాపనికాదు. “ఆయన దైవశక్తి జీవమునకును, భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేసెను” అని 2 పేతురు 1:3లో వ్రాయబడియున్నది. వాయిద్యములు ఆత్మీయ జీవమునకుగాని, భక్తికిగాని సంబంధించిలేవు, వాటిని వినియోగించుట విశ్వాస సంబంధమైన పనికాదు. ఏలయనగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన వాక్యము వలన కలుగును. వాక్యప్రకారము కానిది యేదయినను విశ్వాస సంబంధ మైనదియెట్లగును?

మనుష్యుల పారంపర్యాచారమును బట్టి ఆరాధనలో వాయిద్యములను అనేకులు వినియోగించుచున్నారు. అయితే యేసు ఇట్లనుచున్నారు: “మీరును పారంపర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించుచున్నారు?......... ......... ......... ......... మీరు మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నారు. వేషధారులారా - ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురుగాని వారి హృదయము నాకు దూరముగ ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారని యెషయా మిమ్మును గూర్చి ప్రవచించిన మాట సరియే” (మత్తయి 15:6-9).

గనుక నీవు దేవుని యధార్థముగ ఆరాధించగోరుచున్న యెడల ఆయనను, ఆయన కోరిన రీతిగ ఆయన వాక్యమును బట్టి ఆరాధించుము. స్వేచ్ఛను బట్టిగాని, పెద్దల పారంపర్యాచారమును బట్టిగాని దేవుని కిష్టపూర్వకముగా ఆయనను ఆరాధించలేవు సుమీ!!

**ప్రసంగికులు : జాషువా గూటం**

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న
‘సత్యవాణి’ టీ.వీ. కార్యక్రమమును ప్రతి శనివారం
ఉ॥ 6:30 నుండి 7:00 వరకు
**తేజ** ఛానల్‌లో చూడండి.

ఉపమానమాలిక :

## ముండ్ల పొదల నడుమ పడిన విత్తనము

### లూకా 8:4-14

"విత్తువాడు తన విత్తనములు విత్తుటకు బయలుదేరెను. అతడు విత్తుచుండగా కొన్ని విత్తనములు త్రోవ ప్రక్కను పడి త్రొక్కబడెను గనుక, ఆకాశ పక్షులు వాటిని మ్రింగివేసెను మరికొన్ని రాతి నేలను పడి, మొలిచి చెమ్మ లేనందున ఎండి పోయెను. మరికొన్ని ముండ్ల పొదల నడుమ పడెను; ముండ్ల పొదలు వాటితో మొలిచి వాటి నణచివేసెను. మరికొన్ని మంచి నేలను పడెను, అవి మొలిచి నూరంతలుగా ఫలించెనని" యేసు ప్రభువు విత్తువాని ఉపమానమును చెప్పారు (లూకా 8:4-8).

"ముండ్ల పొదలలో పడిన (విత్తనమును పోలిన) వారెవరనగా విని, కాలము గడిచిన కొలది యీ జీవ సంబంధమైన విచారముల చేతను, ధన భోగముల చేతను అణచి వేయబడి పరిపక్వముగా ఫలింపని వారని" ఆయన దాని భావాన్ని చెప్పారు (లూకా 8:14).

యేసు ప్రభువు వాక్యము ప్రకటింప బడుచుండగా వినుచున్న వారిలో ముండ్ల పొదల వంటి హృదయమును కలిగిన వారుంటారు. ఇట్టివారు వాక్యమును వినువారే గాని ఐహిక విచారమును, ధనమోసమును ఆ వాక్యమును అణచి వేయును గనుక వారు నిష్ఫలు లగుదురు (మత్త 13:22). ముండ్ల పొదలలో పడిన విత్తనములు పడిన స్థలము మంచిదే. ఆ నేల కాళ్లతో త్రొక్కబడుట వలన గట్టిబడి పోలేదు; లేదా రాతి నేలవలె పై పొర మట్టుకు మాత్రమే మట్టి కలిగి యుండ లేదు. ఈ నేలతో యున్న సమస్య యేమంటే, అది సహజంగా మంచిదే గాని ముండ్ల పొదలు గచ్చ పొదలు దానిలో బాగా మొలిచి పోయాయి. ఈ ముండ్ల పొదలు నడుమ పడిన విత్తనములు మొలిచాయి, వాటితోనే ముండ్లపొదలు కూడా మొలిచాయి. గాని ఈ పొదలు వాటికంటె త్వరలో పెరిగి పైకి అలుముకొని క్రిందనున్న మంచి మొక్కలకు గాలి, వెలుతురు లభించకుండా మూసివేసాయి. ముండ్లపొదలు ఎదిగి చివరకు వాటిని

అణచివేసాయి. ముండ్లపొదలను పోలిన హృదయము గలవారు, వినిన వాక్యమునకు సంభవించేది యిదే: "ముండ్ల పొదలలో విత్తబడినవారు విందురుగాని ఐహిక విచారములును, ధన మోసమును మరి ఇతరమైన అపేక్షలును లోపల చొచ్చి వాక్యమును అణచివేయుటవలన అది నిష్ఫలమగును" (మార్కు 4:19).

ముండ్లపొదలను పోలిన హృదయము గలవారు దేవుని వాక్యమును వింటారు. నిజానికి ప్రతివానికి విశ్వాసము కలిగే విధానము అది. క్రీస్తును గూర్చి, రక్షణను గూర్చి వినకుండా వారేమి చేయలేరు. ముండ్ల పొదలను పోలిన హృదయము గలవారు వాక్యమును విందురుగాని ఈ జీవ సంబంధమైన విచారముల చేతను ధనభోగముల చేతను వారు వినిని వాక్యము అణగ ద్రొక్క బడతాది. ఈ జీవ సంబంధ మైన విచారములు, అంటే యేమి తిందుమో, యేమి త్రాగుదుమో, యేమి ధరించుకొందుమో యని తలస్తూ తమ జీవితాన్ని వెళ్ల బుచ్చుతారు. మానవుడు కష్టపడి చెమటోడ్చి పని చేయాలి, నిజమే గాని (ఆది 3:19), కేవలం ఈ జీవన సంబంధమైన చింతనలో అతడు మునిగి పోరాదు. అందువలన నేను మీతో చెప్పనదేమనగా ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చి యైనను, ఏమి ధరించు కొందుమో అని మీ దేహమును గూర్చి యైనను చింతింపకుడి. ఆహారము కంటె ప్రాణమును, వస్త్రము కంటె దేహమును గొప్పవి కావా? ఆకాశ పక్షులను చూడుడి; అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు; అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించు చున్నాడు.......... కాబట్టి ఏమి తిందుమో యేమి త్రాగుదుమో యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి......... ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును" అని యేసు ప్రభువు బోధించారు (మత్తయి 6:25-33). యేసు ప్రభువు అట్లు బోధిస్తే, అనేకులు "రేపు చనిపోదుము గనుక తిందము త్రాగుదము" అని

తలుస్తారు; ఆ రీతిగా ప్రవర్తిస్తారు (1 కొరి 15:32).

ముండ్ల పొదల నడుమ విత్తబడిన హృదయమును పోలినవారు ధన భోగము వలన, లేక మోసము చేత వారి హృదయములలో విత్తబడిన వాక్యమును అణచి వేస్తారు. వెండి, బంగారములు ప్రభునివే (హగ్గయి 2:8). మరల ఐశ్వర్యమును, గొప్పతనమును యెహోవా వలన కలుగును అని బైబిలు గ్రంథము బోధించుచున్నది (1 దినవృ 29:12). గాని ఒకని జీవిత ముఖ్యోద్దేశము ఈ లోక ధన సంపాదన కాకూడదు. కొందరు లంచగొండితనము, అబద్ధము, మోసము చేసి ధనవంతులగుటకు తాపత్రయము పడతారు. గాని "ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును, హానికరములైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము, కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" యని దేవుని వాక్యము చెప్పుచున్నది (1 తిమోతి 6:9, 10). అయితే "సంతుష్టి సహితమైన దైవ భక్తి గొప్ప లాభసాధనమై యున్నది. మనమీ లోకములోనికి ఏమియు తేలేదు, దీనిలో నుండి ఏమియు తీసికొని పోలేము. కాగా అన్న వస్త్రములు గలవారమైయుండి వాటితో తృప్తిపొంది యుందము" (1 తిమో 6:6-8). ధనవంతుడైన యౌవనస్థుడు నిత్య జీవంలో ప్రవేశింపగోరాడు గాని, అతని ధనము అతనికి అడ్డుతగిలింది (మత్తయి 19:17-22).

ఈ లోక గొప్ప తనము కొరకు యత్నిస్తూ మానవుడు తన ఆత్మీయ జీవితాన్ని పోగొట్టుకొనుచున్నాడు. కళలలోను, విజ్ఞానములోను, సాహిత్యములోను ఘనత సంపాదించుకొనే ఆసక్తి వలన దేవుని వాక్యము వారి జీవితాల్లో అణచివేయబడు చున్నది. సిరికిని దేవునికిని గొప్ప వైరమున్నది. "ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు.......... మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండ

నేరరని" యేసు ప్రభువు బోధించాడు (మత్తయి 6:24). ఈలోక స్నేహము దేవునితో వైరమని, ఈ లోకముతో స్నేహము చేయగోరువాడు దేవునికి శత్రువగునని యాకోబు బోధించాడు (యాకోబు 4:4).

మన ఆత్మీయ జీవితం పెరగాలంటే, దానికొరకు మన జీవితంలో సరిపడినంత స్థలాన్ని మనం కేటాయించాలి. ఐహిక సంబంధమైన అనేక సంగతులతో మన జీవితం ఇరుకైపోయిన యెడల ఆత్మీయ జీవితం అణచివేయ బడతాది. దీని యుద్దేశం ఇహ సంబంధమైన వృత్తి వ్యాపారములను కేవలం విసర్జించాలని కాదుగాని, వాటిని బట్టి మన జీవితం పాలింపబడేకంటే, మనమే వాటిని పాలించేలాగ చూచుకోవాలి. వృత్తి వ్యాపారములలో క్రైస్తవ జీవితం జోక్యం చేసుకోకూడదని చెప్పేవాడు, తన క్రైస్తవ జీవితంలో వృత్తి వ్యాపారములను జోక్యం చేసుకో నిచ్చు చున్నాడు.

నీ ఆత్మీయ జీవితాన్ని అణగద్రొక్కే సమస్య లేమిటి? నీ ఉద్యోగమా? వ్యాపారమా? ధనమా? కుటుంబమా? యేమిటి? వాటిని తెలిసికొని జయించు, క్రీస్తు కొరకు మంచి ఫలములు ఫలించు.

'సత్యవాణి' రేడియో కార్యక్రమాలను ప్రతి ఆది, సోమ, బుధ గురువారాల్లో మధ్యాహ్నం 2:00 గంటలకు రేడియో శ్రీలంక ద్వారా వినండి. మీ బంధుమిత్రులకు విన్పించండి!!

## "నోవహుదినములు ఏలాగుండెనో.........."

*(As the Days of Noah Were ............)*

యేసు దేవాలయము నుండి వెళ్లుచుండగా ఆయన శిష్యులు దేవాలయ నాశనమును గూర్చి, ఆయన రెండవ రాకడను గూర్చియు రెండు ప్రశ్నలడిగిరి. మొదటి ప్రశ్నకు ఆయనిచ్చిన సమాధానము మత్తయి 24:1-26లోను, రెండవ ప్రశ్న యొక్క సమాధానము 27-50 వచనము లలోను రికార్డు చేయబడియున్నది. ఈ లోకాంతమును గూర్చి చెబుతు ఆయన " అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రిమాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను కుమారుడైనను ఎరుగరు. నోవహు దినములు ఏలాగుండెనో మనుష్యకుమారుని రాకడయును ఆలాగే ఉండును. జల ప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లు దినము వరకు వారు తినుచు, త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లి కిచ్చుచు నుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొని పోవు వరకు ఎరుగకపోయిరి; ఆలాగుననే మనుష్య కుమారుని రాకడ ఉండును" అని చెప్పెను (మత్త 24:36-39). యేసు యొక్క రెండవ రాకడకు ముందున్న దినములు, నోవహుకాలములో జలప్రళయమునకు ముందున్న దినములతో ఆయన పోల్చిచెప్పెను.

### నీతిమంతుడైన నోవహు

జనులు భూమి మీద విస్తరింప నారంభించినప్పడు వారి దుష్టత్వము కూడ భూమిపై విపరీతముగ పెరిగిపోయెను. అందువలన నరులను చేసినందుకు దేవుడు సంతాపము నొందెను. ఆయన భూమి మీద నుండకుండ నరులను నాశనము చేతునని నిశ్చయించెను. అయితే నీతిమంతుడైన నోవహు దేవుని దృష్టిలో కృప పొందిన వాడాయెను. ఆయన చితిసారకపుమ్రానుతో ఒక ఓడను చేసి కొనుమని నోవహును ఆజ్ఞాపించెను. భూమి మీదనున్న సకల జీవరాసులు రెండేసి చొప్పన ఆ ఓడలో ప్రవేశించెను. నోవహును అతని భార్యయు, ముగ్గురు

కుమారులును వారి భార్యలును ఆ ఓడలో ప్రవేశింపగా గొప్ప జలప్రళయము ద్వారా నాటి పాపలోకమును దేవుడు నాశనము చేసెను. నలువది దివారాత్రులు గొప్ప వర్షము కురిసెను. అయితే అంతకు ముందు భూమిమీద ఎన్నడు వర్షము కురియలేదు. అయినను దేవుడు చెప్పిన మాటలను నోవహు విశ్వసించెను. "విశ్వాసమును బట్టి నోవహు అది వరకు చూడని సంగతులను గూర్చి దేవుని చేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై తన యింటి వారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను; అందువలన అతడు లోకము మీద నేరస్థాపన చేసి విశ్వాసమును బట్టి కలుగు నీతికి వారసుడాయెను" (హెబ్రీ 11:7). దేవుడు " పూర్వ కాలమందున్న లోకమును విడిచి పెట్టక భక్తిహీనుల సమూహము మీదికి జల ప్రళయును రప్పించినప్పుడు నీతిని ప్రకటించిన నోవహును మరి యేడుగురిని కాపాడెను" (2 పేతురు2:5).

## రెండు రకములైన ప్రజలు

నోవహు కాలము నాటి తరము వారిని రెండు రకాలుగా మనము విభజింప వచ్చును: నోవహుతో కూడ ఓడలో ప్రవేశించిన తన భార్య, ముగ్గురు కుమారులు, ముగ్గురు కోడళ్ల మొదటి తరగతి వారు రక్షింపబడిన వారు. ఓడలో ప్రవేశింపక జలప్రళయము వచ్చి వారిని నాశనము చేసే వరకు తినుచు త్రాగుచు పెండ్లాడుచు, పెండ్లికిచ్చుచు యున్నవారు రెండవ తరగతివారు, నాశనమొందినవారు.

యేసు క్రీస్తు యొక్క రెండవ రాకడకు ముందున్న దినములలో మనము నివసించు చున్నాము. ఇప్పుడు కూడా రెండు రకములైన ప్రజలున్నారు. క్రీస్తు సువార్తను విని దానికి లోబడినవారు నోవహు కుటుంబము వలె రక్షింపబడిన మొదటి కోవకు చెందినవారు. క్రీస్తు సంఘమునకు వెలుపల యున్నవారు రెండవ కోవకు చెందినవారు. వారు కూడ తినుచు త్రాగుచు పెండ్లాడుచు మత్తులై యున్నారు. "ఏలయనగా పూర్వము నుండి ఆకాశముండెననియు, నీళ్లలో నుండియు నీళ్లవలనను సమకూర్చబడిన భూమియు దేవుని వాక్యము వలన కలిగెనినియు బుద్ధి పూర్వకముగా మరతురు. ఆ నీళ్ల వలన

అప్పుడున్న లోకము నీటి వరదలో మునిగి నశించెను. అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనము జరుగు దినము వరకు అగ్ని కొరకు నిలువ చేయబడినదై అదే వాక్యము వలన భద్రము చేయబడి యున్నవి" (2 పేతురు 3:5-7).

## క్రీస్తు రాకడ

యేసు క్రీస్తు యొక్క రెండవ రాకడ సమయం ఎవరికీ తెలియదు. పరలోక మందలి దూతలు కూడ ఎరుగరు. తండ్రియైన దేవునికి మాత్రమే ఎరుక (మత్త 24:36). "మీ హృదయములు ఒకవేళ తిండి వలనను మత్తు వలనను ఐహిక విచారముల వలనను మందముగా ఉన్నందున ఆ దినము అకస్మాత్తుగా మీ మీదికి ఉరివచ్చినట్టు రాకుండ మీ విషయమై మీరు జాగ్రత్తగా ఉండుడి. ఆ దినము భూమి యందంతట నివసించు వారందరి మీదికి అకస్మాత్తుగా వచ్చును. కాబట్టి మీరు జరుగుబోవు వీటినెల్లను తప్పించుకొని మనుష్య కుమారుని యెదుట నిలువ బడుటకు శక్తిగలవారగునట్లు ఎల్లప్పుడు ప్రార్థన చేయుచు మెలకువగా ఉండుడని" ప్రభువు చెప్పెను (లూకా 21:34-36). "లోకులు-నెమ్మదిగా ఉన్నది, భయమేమియు లేదని చెప్పకొనుచుండగా, గర్భిణి స్త్రీకి ప్రసవ వేదన వచ్చునట్లు వారికి అకస్మికముగా నాశనము తటస్థించును గనుక వారెంత మాత్రమును తప్పించుకొనలేరని" అపొ.పౌలు చెప్పెను (1 థెస్స 5:3).

జలప్రళయమునకు ముందటి తరమువారు నోవహు యొక్క ప్రకటనను విశ్వసించలేదు, అతని మాటలకు లోబడలేదు. అతని బోధను నిర్లక్ష్యం చేసారు. హేళన చేసారు. వారు తిని త్రాగుటలో నిమగ్నులై యుండిరి. క్రీస్తు రెండవ రాకడకు ముందున్న తరము వారైన మనము నాశనము కాకుండు నిమిత్తము వారి వలె ఉండకుందము గాక. మనము జాగ్రత్త కలిగి మనప్రభువును కలిసికొను నిమిత్తము సిద్ధపడి యుందాము.

- కవితా గూటం, కాకినాడ.

# బైబిలు సారాంశము క్రీస్తే
## (Christ is the Theme of the Bible)

ఆదికాండములో ఆయన సృష్టికర్త; స్త్రీ సంతానము.

నిర్గమకాండములో ఆయన పాపులకై వధింపబడిన గొర్రెపిల్ల.

లేవీయ కాండములో ఆయన మన ప్రధాన యాజకుడు.

సంఖ్యాకాండములో ఆయన యాకోబు చుక్క.

ద్వితీయోపదేశ కాండములో ఆయన మోషేవంటి ప్రవక్త.

యెహోషువ గ్రంధములో ఆయన దేవుని సైన్యముల కధిపతి.

న్యాయధిపతుల గ్రంధములో ఆయన యెహోవా యొక్క దూత (వార్తావాహుడు).

రూతు గ్రంధములో ఆయన మన బంధువు, విమోచకుడు.

సమూయేలు గ్రంధములో ఆయన విసర్జింపబడిన రాజు.

రాజులు, దినవృత్తాంత గ్రంధములలో ఆయన ప్రభువులకు ప్రభువు, రాజులకు రాజు.

ఎజ్రా, నెహెమ్యా గ్రంధములలో ఆయన ఇహపరములకు ప్రభువు.

ఎస్తేరు గ్రంధములో ఆయన దేవుని కృప, సంరక్షకుడు.

యోబుగ్రంధములో ఆయన తిరిగి లేచి, వచ్చుచున్న విమోచకుడు.

కీర్తనల గ్రంధములో ఆయన ధన్యుడు, దేవుని కుమారుడు, రాబోవుచున్నవాడు, పాలించువాడు, స్తుతికి పాత్రుడు.

సామెతల గ్రంధములో ఆయన మన జ్ఞానము.

పరమ గీతములో ఆయన మన ప్రియుడు.

యెషయా గ్రంధములో ఆయన మన కొరకై బాధింపబడినవాడు.

యిర్మియా గ్రంధములో ఆయన నీతి గల ప్రభువు.

విలాపవాక్యములలో ఆయన దుఃఖించు మానవుడు.

యెహెజ్కేలులో ఆయన సింహాసనాసీనుడు.

దానియేలు గ్రంధములో ఆయన చితుగగొట్టు రాయి.
హోషేయ గ్రంధములో ఆయన దావీదు యొక్క శ్రేష్టమైన రాజు
యోవేలు గ్రంధములో ఆయన సమృద్ధి గల ప్రభువు.
ఆమోసు గ్రంధములో ఆయన ఇశ్రాయేలీయుల రక్షకుడు.
ఓబద్యాలో ఆయన సీనాయి కొండమీద విమోచించువాడు.
యోనా గ్రంధములో ఆయన సమాధి చేయబడి తిరిగి లేచిన రక్షకుడు.
మీకా గ్రంధములో ఆయన నిత్యము ఉండువాడు.
నహూము గ్రంధములో ఆయన ఉగ్రత దినమందు బలమైన దుర్గము.
హబక్కుకులో ఆయన మన విశ్వాసమునకు లంగరు
జెఫన్యా గ్రంధములో ఆయన తీర్పరి, శుద్ధిచేయువాడు,
హగ్గయిలో ఆయన శక్తిగల ప్రభువు.
జెకర్యాలో ఆయన నలుగగొట్టబడిన కాపరి.
మలాకీగ్రంధములో ఆయన నీతి కుమారుడు.
మత్తయి సువార్తలో ఆయన యూదుల రాజు.
మార్కు సువార్తలో ఆయన యెహోవా సేవకుడు.
లూకా సువార్తలో ఆయన పరిపూర్ణ మనుష్య కుమారుడు.
యోహాను సువార్తలో ఆయన దేవుని కుమారుడు.
అపొస్తలుల కార్యములలో ఆయన ఆరోహణుడైన ప్రభువు.
రోమా పత్రికలో ఆయన మన నీతి.
I కొరింధిలో ఆయన మృతులలో నుండి లేచిన ప్రధమ ఫలము.
II కొరింధిలో ఆయన మన కొరకు పాపముగా చేయబడినవాడు.
గలతీ పత్రికలో ఆయన ధర్మశాస్త్రము యొక్క అంతము.
ఎఫెసీ పత్రికలో ఆయన మన కవచ ము.

ఫిలిప్పీయుల పత్రికలో ఆయన ప్రతి అవుసరము తీర్చువాడు.
కొలస్సయుల పత్రికలో ఆయన అన్నింటికంటే ముందున్నవాడు.
I థెస్సలోనికయులులో ఆయన తిరిగి వచ్చుచున్న ప్రభువు.
II థెస్సలోని కయులలో ఈయన జాలిగల న్యాయాధిపతి.
I తిమోతిలో ఆయన మన మధ్యవర్తి.
II తిమోతిలో ఆయన కిరీటములనను గ్రహించువాడు.
తీతు పత్రికలో ఆయన మన మహాదేవుడు.
ఫిలేమోనులో ఆయన తండ్రియొక్క పాలిభాగస్థుడు.
హెబ్రీ పత్రికలో ఆయన విశ్వాసుల విశ్రాంతి; ఛాయల నిజ స్వరూపము.
యాకోబు పత్రికలో ఆయన జ్ఞాన ప్రదాత.
I పేతురులో ఆయన పాతనిబంధన ప్రవచనముల సారాంశము.
II పేతురులో ఆయన దీర్ఘశాంతముగల రక్షకుడు.
I యోహానులో ఆయన జీవ వాక్యము
II యోహానులో ఆయన క్రీస్తు విరోధి యొక్క గురి
III యోహానులో ఆయన శరీరధారియైన సత్యము
యూదా పత్రికలో ఆయన విశ్వాసి యొక్క నిరీక్షణ
ప్రకటన గ్రంధములో ఆయన ప్రేమింపబడు ప్రభువు, రాజు.

గమనిక : సత్యవాక్కు వలయు వారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

Satya Vani, P.O. Box - 80, Kakinada - 533 001.

# యేసు మరల వచ్చును!

*(Christ will come again)*

(యోహాను 14:1-6)

1. యేసు శరీర రీతిగా మరల వచ్చును. (అపొ.కా. 1:10-11)
2. అందరికీ కనబడునట్లుగా ఆయన వచ్చును. (ప్రకటన 1:17)
3. అందరికీ వినబడులాగున ఆయన వచ్చును. ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరధ్వనితోను ఆయన వచ్చును (1 థెస్స 4:16; 1కొరింథీ 15:52).
4. అనుకొనని గడియలో ఆయన వచ్చును. ఆయన వచ్చు సమయం దేవునికి మాత్రమే తెలియును. (మత్తయి 24:36-44).
5. ఆయన అకస్మాత్తుగా వచ్చును. అందువలన ఆయనను కలసికొనుటకు మనం ఎల్లవేళలా సిద్ధపడి యుండాలి (మత్త 24:44).
6. యేసు వేవేల దూతలతో వచ్చును (మత్త 16:27; యూదా:14)
7. ఆయన రాకడలో క్రీస్తు నందు మృతులైనవారు మొదట లేతురు; నాటికి సజీవులై యున్నవారు మధ్యాకాశములో ఆయనను కలసికొందురు (1 థెస్స 4:16-17).
8. క్రీస్తు అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, సువార్తకులోబడని వారికిని ప్రతిదండన చేయును (2 థెస్స 1:7-12).
9. క్రీస్తు రాకడలో, నీతిమంతులేమి, అనీతిమంతులేమి, మృతులైన వారందరు లేపబడుదురు (యోహాను 5:28-29; ప్రకట 20:12-13).
10. యేసు మరల వచ్చునప్పడు భూమియు దానిమీదనున్న సమస్త కృత్యములును కాలిపోవును (2 పేతురు 3:9-13).

11. అప్పుడు దేవుడు క్రీస్తు ద్వారా లోకమునకు తీర్పు తీర్చును (2 తిమో 4:1; అపొ.కా. 17:30-31; రోమా 14:12; ప్రసంగి 12:14; ప్రక 20:12-13).

12. క్రీస్తు వచ్చినప్పుడు నీతి మంతులను, అనీతిమంతులను వేరు చేయును (మత్త 25:31-33).

13. ఆయనకు విధేయులైన వారిని ఆయన రక్షించును. వారు నిత్యము ఆయనతో యుందురు

(2తిమోతి 4:6-8; హెబ్రీ 5:8-10).

14. అవిధేయులను ఆయన శిక్షించును

(మత్తయి 7:21-23; ప్రక 20:14-15)

15. క్రీస్తు తన రాజ్యమైన సంఘమును తండ్రికి అప్పగించును

(1 కొరింథీ 15:24; మత్త 16:18-19).

16. కాలము గతించిపోవును

(ప్రకట 22:5).

క్రీస్తు రాకడకొరకు మానవుడు సిద్ధపడి యుండవలెను.

సువార్తకు లోబడవలెను

(మత్త 28:18-20; మార్కు 16:16).

యేసు ప్రభువు నందు విశ్వాసముంచుము

(యోహాను 3:16; 14:1).

పాపముల విషయమై మారుమనస్సు పొందుము

(అపొ.కా. 2:38).

క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుము (అపొ.కా. 2:38).

నమ్మకమైన క్రైస్తవ జీవితమును జీవించుము

(లూకా 6:46; యోహా 8:31-32).

# యేసును గూర్చి ఖచ్చితంగా చెప్పగలమా?

*(Can we be certain about Jesus?)*

క్రొత్త నిబంధనలో నాలుగు సువార్తలు ప్రత్యేక ప్రయోజనం కొరకు వ్రాయబడెను. యూదయలో నివసించుచు మత్తయి వ్రాసెను. యూదా మత నెరవేర్పేయేసు అని యూదులకు చూపించుటకు అతడు వ్రాసెను.

మార్కు బహుశా రోమాలో యుంటూ రోమీయుల ప్రపంచానికి తన సువార్తను వ్రాసెను. యేసు దేవుని కుమారుడని, ఈ ప్రపంచ ప్రభువని తెలియ జేయుటకు అతడు వ్రాసెను.

లూకా తనసువార్తను ప్రపంచమంతటికీ వ్రాయుసరికి గ్రీసులో యుండెను. క్రొత్త నిబంధనలో యున్న అతి శ్రేష్టమైన గ్రీకు భాషలో అతడు వ్రాసినట్లు విద్వాంసులు చెబుతారు.

యేసు క్రీస్తు దేవుని కుమారుడనే ఋజువులు అనేకములున్నను గత కొద్ది సంవత్సరాలలో ఆయనను గూర్చి సంశయములు పెరుగుచు యున్నవి. అపోహల వలన వారు క్రీస్తును గూర్చిన సత్యమును తెలిసికొన లేకున్నారు. తత్కాలపు వాదులు (Existentialists) వారి నైతిక జీవితానికి స్థిరత్వం లేకున్నారు. సౌఖ్యమే శ్రేష్టమైన పురుషార్థమనువారు (Hedonists) ప్రస్తుతానికే జీవిస్తారు. తమ జీవన విధానాన్ని సమర్థించు కొంటారు. పరిణామ వాదులు (Evolutionists) సృష్టి కర్తను త్యజించి జీవం ఒక అకస్మిక సంఘటన అంటారు. లూకా సువార్త యేసు క్రీస్తు యొక్క చారిత్రక వాస్త వికతను ధృవపరచుచున్నది.

క్రీస్తే క్రైస్తవ్యము. వీరిద్దరు ఒక దానిపై మరొకరు ఆధారపడి యున్నారు. క్రీస్తు యొక్క వ్యక్తిత్వము నుండి ఆయన బోధలను వేరుచేయలేము. లూకాను గూర్చి మనం ఎరిగిన దానిని బట్టి క్రీస్తును గూర్చి మనం ఖచ్చితమైన నిర్ధారణను కలిగి యుండగలము. క్రైస్తవులలో అతడు రెండో తరమువాడు. క్రీస్తును ఎన్నడు చూడలేదు గాని తాను వినిన సంగతులు నిశ్చయముగా జరిగినవని పరిష్కారముగా తెలిసి కొన్నాడు.

అతడు అన్యుడు. మెస్సీయాను గూర్చిన పాత నిబంధన ప్రవచన ముల నభ్యసించిన వాడు కాదు. యూదుల యెడల బహుశ సహజంగా వ్యతిరేక స్వభావం కలవాడు. అతడు దేవతార్చనలో నుండి నేరుగా క్రైస్తవ్యములోనికి మారిన వాడు. సువార్త విషయంలో మొదట సందేహ

శీలుడై యుండవచ్చును.

అపొస్తులుడైన పౌలుకు పరిచర్య చేసిన వైద్యుడు లూకా. నాటి కాలపు వైద్యము ప్రాచీనమైనదే అయినను, వారు కడు జాగ్రత్తతో వైద్యము చేయబాధ్యులు. అందువలన తాను గ్రహించిన సంగతులకు శాస్త్రయుక్తముగా పరిష్కారము కనుగొనుటకు ప్రయత్నించాడు. క్రీస్తు యొక్క అద్భుత జననమును ఒక వైద్యుడు తెలియజేయుట ఆశ్చర్యము!

లూకా తన సాక్షులను క్షుణ్ణంగా పరీక్షించి, ఖచ్చితముగా వాస్తవములను లిఖించెను. అన్నింటి కంటే పైగా తన సువార్తను వ్రాయుట లోదైవిక బయల్పాటువలన నడిపించ బడెను. యేసును గూర్చి లూకా వ్రాసిన ఉద్దేశ్యమును బట్టి అతని రికార్డు ఖచ్చితం. స్వకీయ లాభము కొరకు అతడు వ్రాయలేదు. అట్లయిన సంశయానికి తావుండును. అతడు బహుశ రోమా ప్రభుత్వాధికారియైన థెయొఫిలా కొరకు దానిని వ్రాసెను. యేసు యొక్క క్రమ బద్ధమైన జీవిత చరిత్రను అతని కొరకు పొందు పరచెను. లూకా సువార్తను మనం చదువుచుండగా, యేసు దేవుని కుమారుడనే ఖచ్చితమైన నిర్ధారణకురాగలం. ఆయన ప్రభువని రక్షకుడని మనం ఆయన నంగీక రించాలి. మన జీవితాలపై సార్వభౌ మ్యాన్ని కలవాడు ఆయనొక్కడే. నీ జీవితంపై ఆయనకున్న అధికారమును గూర్చి ఎన్నడైనా ఆలోచించావా? ఆయనను దేవుని కుమారుడని అంగీకరించడమే గాక, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందాలి.

క్రైస్తవ్యం వివిధ భావాలపై ఆధారపడినది కాదు. నజరేయుడైన యేసును గూర్చిన చరిత్రాత్మక సంఘటనలపై అది ఆధారపడి యున్నది. ఆయన దేవుని ఏకైక కుమారుడు.

- రిచార్డ్ జోన్స్

"ఘనత వహించిన థెయొఫిలా, ఆరంభమునుండి కన్నులార చూచి వాక్య సేవకులైన వారు మనకు అప్పగించిన ప్రకారము మనమధ్యను నెరవేరిన కార్యములను గూర్చి వివరముగ వ్రాయుటకు అనేకులు పూనుకొన్నారు. గనుక నీకు ఉపదేశింపబడిన సంగతులు నిశ్చయముగా జరిగినవని నీవు తెలిసికొనుటకు వాటినన్నిటిని మొదట నుంచి తరచి పరిష్కారముగా తెలిసికొని యున్న నేనును నీపేరట వాటిని గూర్చి వరుసగా రచించుట యుక్తమని తలంచితిని" (లూకా 1:1-4).

అగ్రహారంలోను, ఓదూరులోను సోదరులు పులగల సుందర్రావ్ గారు సతీసమేతముగా గొప్ప కృషి చేస్తూ దేవునికి మంచి ఫలములను సంపాదించు చున్నారు.

2003 మే నెల 12, 13, 14 తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు బ్రిడ్జిపేట క్రీస్తు సంఘము క్రీస్తు సువార్త సభలు ఘనముగా నిర్వహించిరి. ఆ కూటములలో సోదరులు యస్. జాన్ (డైరక్టర్, బిక్కవోలు బైబిలు స్కూలు), పి.యస్.ఆర్. జయపాల్ (ర్యాలి), జాషువా గూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి. ప్రతిరాత్రి జరిగిన కూటములకు అనేక మంది హజరై ప్రశాంత వాతావరణములో క్రీస్తు సువార్తను వినిరి. స్థానిక సంఘము బహుగా క్షేమాభివృద్ధి నొందెను. కొవ్వూరు బ్రిడ్జిపేటలోను, దొమ్మేరులోను సోదరులు సి.హెచ్. రాజేంద్రప్రసాద్ గారును, వారి తండ్రి క్రిష్టియన్ దాస్ గారును సువార్త పరిచర్య చేయుచున్నారు.

2003 మే నెల 18, 19, 20 తేదీలలో కృష్ణాజిల్లా కంచికచర్లలో సువార్త మహాసభలు జరిపించబడెను. ప్రతిరోజు రాత్రి కంచికచర్ల అంబేద్కర్ కమ్యూనిటీ గ్రౌండ్స్‌లో ఈ మహాసభలు జరిపించబడెను. ఈ కూటములను పరిటాలలో యున్న (వెల్లంకి) క్రీస్తు సంఘమున నిర్వహించిరి. సోదరులు విక్టర్ డేనియల్ తురాకా (తెనాలి), బి. జాన్‌సన్ (తెనాలి), యన్.కె.వై. దాస్ (ఇబ్రహీం పట్నం), జి. మార్కు (నందిగామ), జాషువా గూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి. ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు అంబేద్కర్ కమ్యూనిటీహాలులో సువార్తికుల సదస్సు నిర్వహించబడెను. సువార్త సభల సందర్భముగా నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఎవాంజిలిస్టు యం. రాజేంద్ర కుమార్ గారు ఈ సభలకు సారధ్యము వహించి వాటిని జయప్రదముగా నడపించిరి. సువార్త సభల మూడు రోజులలోను వడగాల్పులు తీవ్రముగా యుండెను. అయినను అనేకులు సత్యసువార్త వినుటకు కంచికచర్ల గ్రామస్థులకు దేవుడు గొప్ప అవకాశము కల్పించెను.

- - -

ప్రతి శనివారం తేజ ఛానల్‌లో ప్రసారమయ్యే సత్యవాణి టి.వీ. కార్యక్రమము ద్వారా అనేక వేల మంది ఆత్మీయంగా బలపడు చున్నారు. వందలాది ప్రజలు మారుమనస్సు, బాప్తిస్మము పొందుచున్నట్లు వ్రాయు చున్నారు. అందుకు దేవునికి స్తోత్రం. ప్రతి స్థానిక క్రీస్తు సంఘములోను సత్యవాణి రేడియో, టి.వీ. కార్యక్రమముల నిమిత్తమై ప్రార్థించమనవి.

తేజ ఛానల్‌లో ప్రసారమయ్యే సత్యవాణి టి.వీ. కార్యక్రమాలు ప్రతి శనివారం ఉదయం 6:30 నుండి 7:00 వరకు. మరియు రేడియో కార్యక్రమము ప్రతి ఆది, సోమ, బుధ గురువారాల్లో మధ్యాహ్నం 2:00 గంటలకు రేడియో శ్రీలంక ద్వారా వినండి.

మీ బంధుమిత్రులకు విన్పించండి!!

❋ ❋ ❋

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:

SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.